క్లుప్తంగా

విద్యార్థికి లాప్‌టాప్ వితరణ



అచ్చంపేట: బీటెక్ విద్యార్థికి స్నేహ హస్తాలు ఫౌండేషన్ ద్వారా సంఘ సేవకురాలు మామిళ్ల పల్లి విజయలక్ష్మి ఆదివారం అచ్చంపేటలో లాప్‌టాప్ అందజేశారు. విద్యార్థి షేక్ ఫైజాని వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. ఆమె ప్రాజెక్టు వర్క్ నిమిత్తం రూ.40వేలు విలువచేసే లాప్‌టాప్, హాస్టల్ ఫీజు నిమిత్తం రూ.10వేలు అందజేయడం జరిగింది. ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరిముల్లా బాబు మాట్లాడుతూ.. విద్యార్థి హాస్టల్ ఫీజు ఏడాదికి రూ.10వేలు చొప్పున రెండేళ్ల నుంచి ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

80మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు



అచ్చంపేట: సుగుణ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులు మండలంలోని మాదిపాడు లూథరన్ చర్చి ఆవరణలో ఆదివారం ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిట్యాల దావీదు మాట్లాడారు. కంటి లోపాలున్నవారిని ఆదుకునేందుకు ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మొత్తం 80మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరందరికీ దూళిపాళ్లలోని ఎల్వీ ప్రసాద్ వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్స్ చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై. కమలాకరరావు, దేవరశెట్టి శ్రీనివాసరావు, ఆదాం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



నకరికల్లు: ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొన్న ఘటన ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం ధ్వంసమైంది. అదృష్టవశాత్తు ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై జరిగిన ప్రమాద ఘటన వివరాలు.. నకరికల్లులోని అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి ఫ్లైఓవర్ దిగగానే వై జంక్షన్ వద్ద కుడివైపుకు తిరిగేందుకు ట్రాక్టర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి పిడుగురాళ్ల వైపు వస్తున్న నరసరావుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీసి.. వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని లిఖిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు రామిరెడ్డి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కుందురువారి పాలెం గ్రామంలో హాస్పిటల్ చైర్మన్ మేకలరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందించారు. జనరల్ సర్జన్ ఎం.విశ్వనాథరెడ్డి పాల్గొని వైద్య సేవలందించారు. సర్పంచ్ సీహెచ్ వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.

రాహు, కేతువులకు విశేష పూజలు



నకరికల్లు: నర్సింగపాడు గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో రాహు, కేతువులకు ఆదివారం విశేష పూజలు చేశారు. ఆదివారం ప్రత్యేకమైన రోజు కావడంతో అర్చకులు కొమ్మవరపు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ముందుగా వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివార్లను విశేషంగా అలంకరించారు. స్వామివార్లను దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించారు.

అంగరంగ వైభవం.. మల్లాది వేంకటేశ్వరుని కల్యాణం

దర్శించుకొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



స్వామివారి కల్యాణోత్సవం



విశేష అలంకారంలో మల్లాది వెంకటేశ్వరుడు



స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నంబూరు తదితరులు

అమరావతి: భక్తుల పాలిట కొంగుబంగారం. కోరిన కోర్కెలు తీర్చే కలియుగ దైవం.. స్వయంభుగా వెలసిన మల్లాది వటవృక్షాంతర్గత వేంకటేశ్వరుని 46వ వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. వేకువ జామున ఆలయ అర్చకులు వినుకొండ శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి అభిషేకానికి బిందె తీర్థం కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రాతఃకాల అర్చన నిర్వహించారు. స్వామి వారికి పంచ సూక్తాలతో పంచామృత స్నపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులు తీసుకొచ్చిన తులసీ దళాలతో స్వామి వారికి సహస్ర నామ తులసీదళ సేవ నిర్వహించి, విశేష అలంకారం గావించారు. 11 గంటలకు దేవాలయ ఉత్తర భాగాన ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం ప్రారంభించారు. వైఖానస ఆగమ శాస్త్రానుసారం పరుచూరి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో శనగవరపు రామ్మోహనశర్మ ప్రత్యక్ష వ్యాఖ్యానంతో సుమారు 50 మంది దంపతులచే స్వామి వారి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు పెద శేష వాహనంపై ఉభయదేవేరులతో వేంకటేశ్వరుని గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగించి, మర్రిచెట్టు వద్ద స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు ఏలూరి శ్రీనివాసరావు భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఈ తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నంబూరు

తిరునాళ్ల సందర్భంగా వటవృక్షాంతర్గత వేంకటేశ్వరుని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఆయన వెంట క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపాజ్వాల లక్ష్మీనరసింహారావు , వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబురావు, భవిరిశెట్టి హనుమంతరావు, వాసు అళ్ల శ్రీనివాసరెడ్డి, మంగిశెట్టి కోటేశ్వరరావు తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనాయకులు ఉన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదు

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు



సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు తదితరులు

అమరావతి: టీడీపీ నాయకులు తమ నీచ రాజకీయాలతో అభివృద్ధిని అడ్డుకుందామని చూస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదని . పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు హెచ్చరించారు. అమరావతిలోని 2వ సచివాలయం పరిధిలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ముస్లిం కాలనీలో గడప గడపకు తిరుగుతూ కాలనీ వాసుల సమస్యలను ఎంతో ఓపికతో విన్నారు. అధికారులతో చర్చించి వెంటనే పరిష్కారం సూచిస్తూ.. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడారు. సంక్షేమ పథకాల పంపిణీలో కుల, మత, పార్టీ, వర్గాల వివక్షకు తావులేకుండా అర్హులందరికీ అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో 870 ఇళ్ల స్థలాలు పంపిణీచేస్తే అందులో 190 ఇళ్ల స్థలాలు ముస్లింలకు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామం మొత్తానికి రూ.35 కోట్ల సంక్షేమ సాయం అందిస్తే ముస్లింలకు సుమారు రూ.6 కోట్ల సాయం అందినట్లు తెలిపారు. ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ఒక్కరూ కూడా తమకు అర్హత ఉండి పథకాలు వర్తించలేదని చెప్పలేదన్నారు. కొంత మంది టీడీపీ నాయకులు కావాలనే నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అడ్డుకుంటే అభివృద్ధిని, సంక్షేమాన్ని అడ్డుకున్నట్లేనన్నారు. ఎవరో ఇద్దరు, ముగ్గురు నాయకుల స్వార్థ రాజకీయాల కోసం ముస్లిం సోదర సోదరీమణులందరిని బలి చేయడం దారుణమన్నారు. టీడీపీ ప్రభుత్వంలో.. ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన సంక్షేమాభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. కోట్ల రూపాయల అభివృద్ధి జరుగుతుంటే చూసి ఓర్వలేక అమాయకులైన ప్రజలను రెచ్చగొడుతున్నారని ఇలాంటి వారందరికి.. ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టే నాయకులను నమ్మవద్దని కోరారు. 400 గడపలను సందర్శించిన ఎమ్మెల్యే ప్రభుత్వ కార్యక్రమాలను వివరించి జగనన్నను, తనను మరోసారి ఆశీర్వదించమని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కోట హరిబాబు, జడ్పీటీసీ ఈదర్పుగంటి కరుణకుమారి, జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ, మండల పార్టీ అధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి, ఉప సర్పంచ్ నిమ్మా విజయసాగర్‌బాబు, పార్టీ నాయకులు నంబూరు బాబురావు, మంగిశెట్టి కోటేశ్వరరావు, అలా లక్ష్మీనారాయణ, నందూరి కరుణకుమార్, శివరామకృష్ణ, పి.రోశిబాబు, అళ్ల శ్రీనివాసరెడ్డి, భవిరిశెట్టి హనుమంతరావు, చిల్కా సాంబయ్య, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు మాదాసు పావని నాయుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ మండల కన్వీనర్‌గా వెంకటరెడ్డి



ఎమ్మెల్యే శంకరరావును సత్కరించిన వెంకటరెడ్డి

బెల్లంకొండ: సచివాలయాల మండల కన్వీనర్‌గా మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన వైయస్సార్ సీపీ నాయకుడు గాదె మిల్లు వెంకటరెడ్డిని ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని వైఎస్సార్ సీపీ బలోపేతానికి పని చేస్తానని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా కృషి చేస్తానని తెలిపారు. మండల నాయకులతో కలసి ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సత్కరించారు. తన నియామకానికి కృషి చేసిన ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, మండల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చురుగ్గా అమరావతి – క్రోసూరు రోడ్డు సర్వే



సర్వే చేస్తున్న అర్‌అండ్‌బీ సిబ్బంది

అమరావతి: మూడు మండలాలను కలుపుతూ.. ఐదు మండలాల ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం రూ.148.95 కోట్లతో అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు నిర్మించనున్న డబుల్ లేన్ రోడ్డు సర్వే పనులు చురుకుగా సాగుతున్నాయి. 2019 ఎన్నికల సందర్భంగా అమరావతి నుంచి క్రోసూరు మీదుగా డబుల్ లేన్ రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రజలకు ఇచ్చిన హామీ కార్యరూపం దాలుస్తోంది. ఫిబ్రవరిలో సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. సుమారు పది సర్వే బృందాలు బెల్లంకొండ అడ్డరోడ్డు నుంచి అమరావతి వరకు సుమారు 50 కిలో మీటర్లు సర్వే చేస్తున్నాయి. ఇంత త్వరగా రోడ్డుకు సంబంధించిన సర్వే, శంకుస్థాపన జరుగుతుండటంపై నియోజక వర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష



డీఎస్పీతో మాట్లాడుతున్న అడ్మిన్ అడిషనల్ ఎస్పీ బిందుమాధవ్

సత్తెనపల్లి: పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సత్తెనపల్లి మండలం కంటెపూడి సమీపంలోని నలంద ఇంజినీరింగ్ కళాశాలలోని రెండు బ్లాకుల్లో పరీక్ష జరిగింది. మొత్తం 776 మంది అభ్యర్థులకు.. 660 మంది పరీక్షకు హాజరయ్యారు. 116 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ బిందు మాధవ్ సందర్శించి, పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పరీక్షల నిర్వహణ చేపట్టారు. బందోబస్తుపై సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణతో మాట్లాడారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ కుమార్ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహించారు. బందోబస్తులో సత్తెనపల్లి రూరల్ సీఐ రామిశెట్టి ఉమేష్, సిబ్బంది, ఉన్నారు.

ఆకట్టుకున్న స్వర నీరాజనం



గీతాలు ఆలపిస్తున్న చంద్రతేజ

సత్తెనపల్లి: మధుర గాయకుడు, గాన గంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 49వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద నిర్వహించిన స్వర నీరాజనం(సంగీత విభావరి) ఆకట్టుకుంది. కొఠారి రంజిత్ కుమార్ నిర్వహణలో మజీర మెలోడీస్ ఆర్కెస్ట్రా, సుశీల్ మీడియా ఎంటర్‌టైన్మెంట్ సంయుక్త నిర్వహణలో ఘంటసాల, సూపర్ స్టార్ కృష్ణ మధుర గీతాలను గాయకుల ఆలపించారు. స్వరాభిషేకం గాయకుడు జె.చంద్రతేజ, సింగర్స్.. శైలజ, బెల్లంకొండ భారతి, ఎస్ సుఖి, స్నేహ శ్రీ సుశీల్ కుమార్, కొఠారి రంజిత్ కుమార్, అంజలి కోటేశ్వరరావు తమ గాత్రంతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేశారు. సుంకర ఆంజనేయులు కీబోర్డు, పి.బాలాజీ , శ్రీకాంత్ తబలా, బి.ప్రసాద్ ప్యాడ్స్, గుంటూరు వేద సౌండ్స్ అందించారు. ఈ సందర్భంగా గుంటూరు కళా దర్బార్ వ్యవస్థాపకుడు పొత్తూరి రంగారావు, సత్తెనపల్లి రంగస్థలం నటుడు ముట్టే రాంబాబులను సత్కరించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం

ఎర్రబాలెం(క్రోసూరు): మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త వెలది నరసింహరావు(53) శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. నరసింహరావు చెరువు నీటి సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. గల్లా గురుపాదం, కార్యకర్తలున్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వెంకట రోహిత్

సత్తెనపల్లి: భరతమాత అన్న ప్రసాద వితరణ పథకంలో భాగంగా పేదలకు, వృద్ధులకు ఆదివారం ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన తాడువాయి సోమేశ్వరరావు సతీమణి నాగజ్యోతి ఆర్థిక సాయంతో.. కుమార్తె హర్షిక జన్మదినం సందర్భంగా ఆమె సోదరుడు వెంకట రోహిత్ భోజన ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, నాయకులు కూరపాటి వెంకట బసవయ్య, చందోలు వెంకట మల్లికార్జునరావు, ఎద్దులదొడ్డి రమేష్ తదితరులున్నారు.

కబడ్డీ పోటీల సన్నాహక సమావేశం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో జరగబోయే కబడ్డీ పోటీల నిర్వాహణపై పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు కేతన బోయిన హనుమంతురావు అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి పి.హరి పావని హాజరయ్యారు. కబడ్డీ నిర్వహణపై చర్చించారు. అనంతరం పి.హరి పావనిని సత్కరించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కట్టా శంకరరావు, సీనియర్ నాయకులు చందోలు వెంకట మల్లికార్జునరావు, గడ్డం శివశంకరరావు, విశ్వనాథుని శ్రీనివాసరావు, పీఈటీ పుచ్చకాయల శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో పూర్ణ నేత్రాలయ, దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. కంటి వైద్యులు కొనకంచి రాజేష్, దంత వైద్యులు యర్రమాసు శ్రీలత వైద్య సేవలందించారు. మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వైద్యులను సన్మానించారు.

పూజారి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే, కమీషనర్

పెదకూరపాడు: మండలంలోని పరస గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ప్రధాన పూజారి కటుతుకుంట్ల గోపీకృష్ణ అనారోగ్యంతో మృతి చెందడంతో.. ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రూ.15వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. గోపీకృష్ణ కుటుంబానికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపట్నుంచి నవదిన ప్రార్థనలు ప్రారంభం



రెంటచింతల కానుక మాత చర్చి

రెంటచింతల: స్థానిక కానుక మాత చర్చి 173వ మహోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం నుంచి నవ దిన ప్రార్థనలు ప్రారంభం కానున్నట్లు విచారణ గురువు ఏరువ లూర్ధుమర్రెడ్డి తెలిపారు. చర్చిలో విలేకర్లకు ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4.30గంటలకు సాగరు మాత చర్చి విచారణ గురువు రెవ.ఫాదర్ పామిశెట్టి జోసఫ్ సాగర్ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం 1850లో నిర్మించిన పురాతనమైన కానుక మాత దేవాలయం ప్రాంగణంలో దివ్యపూజాబలితో పండుగ మహోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 25న ఆరోగ్య మాత మందిరం వద్ద రెవ.ఫాదర్ రత్నరాజు, 26న ఫాతిమా మాత మందిరం వద్ద రెవ.ఫాదర్ ఎస్.సతీష్‌కుమార్, 27న బాలవికాస్ హైస్కూల్‌లో నిత్య సహాయమాత మందిరం వద్ద ఫాదర్ హృదయ్ సమస్కన్స్, 28న లూర్దు మాత మందిరం వద్ద రెవ.ఫాదర్ అంద్రెయ రాజు హెచ్‌జీఎన్, 29న ఆనంద పేటలో రెవ.ఫాదర్ కొమ్మారెడ్డి సందీప్‌రెడ్డి, 30న పిచ్చుకలగడ్డ మిట్టమీద రెవ.ఫాదర్ ఎ.తంబి ఎస్‌సీజే, 31న పునీత ఆరోగ్యనాథుని మందిరం వద్ద రెవ.ఫాదర్ యామర్తి సురేష్, ఫిబ్రవరి 1న పునీత అంతోనివారి మందిరం వద్ద రెవ.ఫాదర్ కన్నా అనిల్‌తో ప్రతిరోజు సాయంత్రం గం.4.30గంటలకు దివ్యపూజాబలి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ నవ దిన ప్రార్థనలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, కానుకమాత దీవెనలు పొందాలని ఫాదర్ వైఎల్ మర్రెడ్డి కోరారు.

అవోపా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నరసరావుపేట ఈస్ట్: సామాజిక సేవా కార్యక్రమాల్ని ఆర్యవైశ్యులు దైనందిన జీవితంలో భాగంగా నిర్వహించాలని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు తెలిపారు. శ్రీపట్టాభిరామస్వామి దేవస్థానంలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం పట్టణ అవోపా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో ఆర్యవైశ్యులు ముందుంటారని తెలిపారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా ఎస్‌బీఐ రిటైర్డ్ చీఫ్ మేనేజర్ కొత్తూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకుడు పానుగంటి శ్రీనివాస సాయి, కోశాధికారిగా కొటక్ మహేంద్ర బ్యాంక్ ఉద్యోగి కొత్తమాసు వెంకటప్పయ్య ప్రమాణ స్వీకారం చేశారు. వీరితోపాటు అడ్వయిజరీ బోర్డు, ఆఫీస్ బేరర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, రీజినల్ కో–ఆర్డినేటర్ పొట్టి శ్రీరాములు, ఎస్‌ఈసీ కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.సుబ్బరాయగుప్త, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జాతీయ సహాయ కార్యదర్శి కె.పి.రంగారావు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

నరసరావుపేట ఈస్ట్: పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య పల్నాడు జిల్లా అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్ తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం పల్నాడు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో ముత్తనపల్లి మాట్లాడుతూ బ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా పరిధిలో అన్ని నియోజకవర్గాలలో సంఘాన్ని పటిష్టపరచాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దండరాజు హనుమంతరావు, శనగల హనుమాన్‌శాస్త్రి, శ్రీనివాసరావు, కోట సాంబశివరావు, కె.వి.పురుషోత్తమరావు, ఎం.మధుసూదనరావు పాల్గొన్నారు.

వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు



ఎ.కోటేశ్వరమ్మ

సత్తెనపల్లి: వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణంలోని వాల్మీకి నగర్ కు చెందిన ఎద్దుల దొడ్డి కోటేశ్వరమ్మ పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పట్టణంలోని వాల్మీకి నగర్ రామాయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కోటేశ్వరమ్మ సంతోషం వ్యక్తం చేశారు. తనపై ఎంతో నమ్మకంతో రెండేళ్లు డైరెక్టర్ పదవి పొడిగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు ఎద్దులదొడ్డి శ్రీనివాసరావు, నల్లబోతుల వెంకటేశ్వర్లు, చొప్పరపు శ్రీను, మల్ల రామకోటయ్య, మల్ల ఆంజనేయులు, మాణిక్యమ్మ, అంజమ్మ, లక్ష్మీ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామ శ్రీ సీతారామస్వామి ఆలయంలో సోమవారం నుంచి ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభంకానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు భువనగిరి ఆంజనేయ శాస్త్రి, కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. బ్రహ్మశ్రీ సాగి నరసింహమూర్తి ఆధ్వర్యంలో జీవధ్వజ, ముత్యాలమ్మ గ్రామ దేవత, పోతురాజు, శతరుద్ర సహిత శత చండీ, మహా మృత్యుంజయ యాగ, పాత పాటేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, పురందేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం పాంచాహ్నిక దీక్షతో నిర్వహించనున్నట్లు తెలిపారు. 5 రోజుల పాటు.. యాగశాలలో రుత్వీకులచే హోమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 27న ఉదయం 9.56గంటలకు యంత్ర స్థాపనం, విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టాలి



నరసరావుపేట: ఆర్టీసీ ప్రయాణమంటే భద్రతతో కూడినదనే నమ్మకం ప్రయాణికుల్లో ఉందని, దాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని ఆర్టీవో టి.కె.పరంధామరెడ్డి తెలిపారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, సిబ్బందికి రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిబంధనల్ని కచ్చితంగా పాటిస్తేనే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని చెప్పారు. డ్రైవర్లంతా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, చెడు అలవాట్లకు లోను కావొద్దని ఆయన సూచించారు. రీజినల్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ అనుకోకుండా జరిగే ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నందున, డ్రైవర్లంతా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. రాంబాబు నిబంధనల్ని వివరించారు. సమావేశంలో డిపో మేనేజర్ వీరాస్వామి, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.